

దున్నితే కేసులే..

అటవీ భూములు దున్నితే కేసులు నమోదు చేస్తామని ఫారెస్ట్ శాఖ అధికారులు హెచ్చరించారు.

- 9లో ▸



వృద్ధుడిని కాపాడిన పోలీసులు

అటవీ ప్రాంతంలో చలనం లేకుండా పడి ఉన్న అనాథ వృద్ధుడిని పెద్దకొడప్‌గల్ పోలీసులు కాపాడారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం

30.6 /22.1

వాతావరణం

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమవుతుంది. ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

రేపు కామారెడ్డిలో జాబ్ మేళా

కామారెడ్డి అర్బన్: కామారెడ్డి ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్ మేళా నిర్వహించనున్నారు. మేజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, కళాశాల టీఎస్‌కేసీ ప్లేస్‌మెంట్ విభాగాల ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కే.కిష్టయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, విప్రో, లాట్ మొబైల్స్, ముత్తూట్ ఫైనాన్స్, డబ్ల్యూ ఎస్ఎస్, కాప్ జెమిని సంస్థలు ఈ మేళాలో పాల్గొంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు ఇతర వివరాల కోసం 99490 55604, 95531 41962 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కలెక్టరేట్‌లో..

కామారెడ్డి క్రైం: నిరుద్యోగ యువతకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి కలెక్టరేట్‌లోని ఉపాధి కల్పన కార్యాలయంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముత్తూట్ గ్రూప్ కంపెనీలలో 50 ప్రొబెషనరీ ఆఫీసర్, 40 సీనియర్ రిలేషన్‌షిప్ ఎగ్జిక్యూటివ్, వంద ట్రైనీ పోస్టుల భర్తీ కోసం ఈ మేళా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏదైనా డిగ్రీ, ఎంబీఏ పూర్తి చేసిన 19 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు వారు ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఇతర వివరాల కోసం 73969 11440, 98482 37987 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేడు అశోక్‌నగర్ రైల్వే గేటు మూసివేత

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని అశోక్‌నగర్ రైల్వే గేటును మరమ్మతులకోసం బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు మూసి వేయనున్నారు. ఈ విషయమై దక్షిణ మధ్య రైల్వే నిజామాబాద్ సీనియర్ సెక్షన్ ఇంజినీర్ నాగభూషణచారి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు రైల్వే శాఖకు సహకరించి, ఇతర మార్గాల ద్వారా వెళ్లాలని సూచించారు.

'ఉపాధ్యాయ సమస్యలపై ఉద్యమ జాగరణ'



కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఉద్యమ జాగరణ చేపట్టనున్నట్లు తెలంగాణప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) జిల్లా అధ్యక్షుడు పుల్లం రాఘవరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తపస్ రాష్ట్ర శాఖ పిలుపుమేరకు ఉద్యమ జాగరణలో భాగంగా మంగళవారం సంతకాల సేకరణ ప్రారంభించామని, ఇది 22వ తేదీ వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. 25న మండల స్థాయిలో నిరసనలు, 31న ఆర్డీవోకు వినతిపత్రాల అందజేత, వచ్చేనెల 5వ తేదీన కలెక్టరేట్ వద్ద ధర్నా, 19న ఇందిరా పార్క్ వద్ద మహాధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో తపస్ ప్రతినిధులు మ్యాక రాంచంద్రం, లక్ష్మణ్‌రావు, భాస్కరాచారి, లక్ష్మీపతి, ఆంజనేయులు, రాజశేఖర్, దత్తాచారి తదితరులు పాల్గొన్నారు.

'మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి'



మద్నూర్: మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆరోగ్య శాఖ రాష్ట్ర పరిశీలకుడు శ్రీనివాస్ సూచించారు. డోంగ్లీ పీహెచ్‌సీని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. డోంగ్లీ పీహెచ్‌సీలో ఇప్పటివరకు 19 ఆరోగ్య మహిళ క్యాంపులు జరిగాయని, ఇందులో 1,418 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారని తెలిపారు. 401 మందికి పరీక్షలు చేయగా 60 మందిలో సమస్యలు గుర్తించి, ఆస్పత్రులకు రిఫర్ చేశారన్నారు. మహిళలకు అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు వైద్యులు ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు చంద్రమౌళి, హిమబిందు, సూపర్ వైజర్‌లు రవి, యాదమ్మ, డీపీవో పద్మజ తదితరులు పాల్గొన్నారు.



పెద్దకొడప్‌గల్ : పోచారం లోలెవల్ వంతెనపైనుంచి ప్రవహిస్తున్న వరద నీరు



లింగంపేట : నాగారం వంతెన వద్ద పెద్దవాగు ఉధృతి

కరుణించిన వరుణుడు

- సీజన్‌లో తొలిసారిగా జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు
- అత్యధికంగా మాచారెడ్డిలో 60 మి.మీ. వర్షపాతం నమోదు
- వాగుల్లో మొదలైన ప్రవాహం
- మరో మూడు రోజులు వర్ష సూచన

ఆలస్యంగానైనా వరుణుడు కరుణించాడు. వానాకాలం సీజన్‌లో తొలిసారిగా జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాన్ని కురిపించాడు. సోమవారం రాత్రి మొదలైన వాన మంగళవారం కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నిన్నటివరకు వానలు లేక తల్లడిల్లిన అన్నదాతలకు ఊరట లభించింది.



రాజంపేట: కొండాపూర్ శివారులో కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు

సాక్షి, కామారెడ్డి: జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తోంది. సోమవారం రాత్రి మొదలైన వాన.. మంగళవారం రోజంతా కురిసింది. వాగులు, వంకల్లో ప్రవాహం ప్రారంభమైంది. చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద నీరు వచ్చి చేరుతోంది. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోవడంతో ఆయా ప్రాంతాల్లో నివసించేవారు ఇబ్బందిపడ్డారు. మంగళవారం ఉదయం వరకు జిల్లాలో సరాసరిన 35.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. అత్యధికంగా మాచారెడ్డిలో 60.0 మి.మీ. వర్షం కురిసింది. జుక్కల్‌లో అత్యల్పంగా 15.8 మి.మీ. వాన పడింది. ముసురు పట్టడంతో జనం ఇళ్లకే పరిమితమయ్యారు. వర్షాలు కురుస్తుండడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు. ఇక సాగు పనులు ముమ్మరం కానున్నాయి.

తెగిపోయిన తాత్కాలిక రోడ్డు

కామారెడ్డి పట్టణం నుంచి రాజంపేట మండలం మీదుగా మెదక్ జిల్లా కేంద్రానికి వెళ్లే రోడ్డుపై కొండాపూర్ -ఎల్లారెడ్డిపల్లి మధ్యలో వంతెన నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. రాకపోకల కోసం ఇక్కడ వేసిన తాత్కాలిక రోడ్డు వర్షానికి కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోవడంతో గుండారం, ఎల్లారెడ్డిపల్లి గ్రామాలతో పాటు మెదక్ జిల్లాలోని పలు గ్రామాలకు వెళ్లడానికి రూటు మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. వంతెన నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలో పోచారం, పోచారం తండాల మధ్య నున్న కాజువేపై భారీగా నీటి ప్రవాహం ఉండడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ముసురుతో రోడ్లు చిత్తడిగా మారాయి.

భారీ వర్ష సూచన...

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రానున్న మూడు రోజుల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని రుద్రూరు కృషి విజ్ఞాన కేంద్రం వాతావరణ విభాగం శాస్త్రవేత్త బి.శ్రీలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులపాటు జిల్లా అంతటా వర్షాలు కురుస్తాయని, ఒకటి రెండు ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. భారీ వర్షాలు కురవనున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.



నిజాంసాగర్‌లోకి 750 క్యూసెక్కుల రాక

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టులోకి మంగళవారం 750 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నందున వాగుల ద్వారా మంజీర నదిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు(17.8 టీఎంసీలు) కాగా.. మంగళవారం సాయంత్రానికి 1,388.03 అడుగుల(3.304 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

'పోచారం'లోకి మొదలైన ఇన్‌ఫ్లో

నాగిరెడ్డిపేట: గాంధారి, తాడ్వాయి మండలాలలో మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టులోకి వరదనీరు వచ్చి చేరుతోంది. లింగంపేట వాగు ద్వారా ప్రాజెక్టులోకి 1,176 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది.

మండలాలవారీగా నమోదైన వర్షపాతం వివరాలు..

మండలం	వర్షపాతం (మి.మీటర్లలో)				
మాచారెడ్డి	60.0	తాడ్వాయి	45.7	బిచ్కుంద	25.2
పాల్వంచ	56.2	రాజంపేట	43.0	ఎల్లారెడ్డి	24.2
రామారెడ్డి	49.5	సదాశివనగర్	40.3	నిజాంసాగర్	22.2
దోమకొండ	48.6	లింగంపేట	36.5	డోంగ్లీ	21.8
బీబీపేట	47.2	బాన్సువాడ	36.2	పెద్దకొడప్‌గల్	19.4
కామారెడ్డి	46.2	భిక్కనూరు	34.3	మద్నూర్	19.2
గాంధారి	46.2	నస్రుల్లాబాద్	33.0	పిట్లం	18.6
		నాగిరెడ్డిపేట	29.4	జుక్కల్	15.8
		బీర్కూర్	27.5		

వీడని అదృశ్యం మిస్టరీ

- కనిపించకుండాపోయిన సింగరాయపల్లి మాజీ సర్పంచ్
- మూడురోజులైనా లభించని ఆచూకీ
- ఆందోళనలో కుటుంబ సభ్యులు
- ఆరా తీస్తున్నామంటున్న పోలీసులు



సత్యాగౌడ్

సాక్షి, కామారెడ్డి: ఆత్మహత్య చేసుకుంటానంటూ సెల్ఫీ వీడియో తీసుకుని, ఫోన్‌తో పాటు సూసైడ్ నోట్ ఇంట్లో వదిలి వెళ్లిన సింగరాయపల్లి మాజీ సర్పంచ్ సత్యాగౌడ్ అదృశ్యం మిస్టరీగా మారింది. మూడు రోజులు గడిచినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. సత్యాగౌడ్ ఈ నెల 16న సాయంత్రం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. అతడి కోసం బంధువులు, తెలిసిన వారికందరికీ ఫోన్ చేసి ఆచూకీ గురించి ఆరా తీశారు. ఎక్కడా సమాచారం దొరక్కపోవడంతో సోమవారం కామారెడ్డి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాల్వంచ మండలంలోని సింగరాయపల్లికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు అధికం నర్సాగౌడ్ రెండు నెలల క్రితం ఆత్మహత్య చేసుకున్నాడు. నర్సాగౌడ్ ఆత్మహత్యకు కారణమంటూ గ్రామానికి చెందిన పలువురిపై ఆయన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో మాజీ సర్పంచ్ సత్యాగౌడ్‌తో పాటు మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు పంపారు. ఇటీవలే బెయిల్‌పై వచ్చిన సత్యాగౌడ్.. కామారెడ్డి పట్టణంలో నివసిస్తున్నాడు. అయితే ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామంలో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులకు సంబంధించి తనకు రావాల్సిన బిల్లులను ఇతరులకు ఇచ్చారని, పెట్టుబడి పెట్టిన తాను అప్పులపాలయ్యానంటూ మూడు రోజుల క్రితం సత్యాగౌడ్ సెల్ఫీ వీడియోలో రికార్డు చేయడంతోపాటు లేఖలో రాసి పెట్టాడు. తాను ఆత్మహత్యకు పాల్పడుతున్నానని, తన చావుకు సింగరాయపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు, ఇసాయిపేటకు చెందిన ఒకరితో పా టు ముగ్గురు అధికారులు, ఉద్యోగులు కా రణమని ఆ వీడియోలో ఆరోపించాడు. సత్యా గౌడ్ సూసైడ్ చేసుకుంటానంటూ తీసుకున్న సెల్ఫీ వీడియో, సూసైడ్ నోట్‌ను ఆయన కుటుంబ సభ్యులు పోలీసులకు అందించారు. మూడు రోజులుగా సత్యాగౌడ్ కోసం కుటుంబ సభ్యులు, బంధువులు వెదుకుతూనే ఉన్నారు. ఆయన ఆచూకీ దొరక్కపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

సీసీ టీవీ ఫుటేజీ పరిశీలన

సత్యాగౌడ్ కామారెడ్డి పట్టణంలో ఉంటున్న ఇంటికి సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైన దృశ్యాల గురించి పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇంటి నుంచి ఎలా వెళ్లాడు? ఆయన వెంట ఎవరైనా ఉన్నారా? ఏ వైపునకు వెళ్లాడు? అన్న విషయాలపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు. అయితే సోమవారం రాత్రి నుంచి వర్షం కురుస్తుండడంతో పోలీసుల విచారణకు ఆటంకం కలిగినట్టు తెలుస్తోంది. సత్యాగౌడ్ వెంట ఫోన్ తీసుకుని వెళ్లకపోవడంతో ఆచూకీ కనుక్కోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

విచారణ జరుపుతున్నాం

సత్యాగౌడ్ అదృశ్యం విషయంలో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ జరుపుతున్నాం. ఇంటి నుంచి ఏ వైపు వెళ్లాడనే దానిపై సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నాం. కాల్ డేటాను కూడా పరిశీలించి ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నాం.

– నరేశ్, పట్టణ సీఐ, కామారెడ్డి

'హాస్టళ్లలో అన్ని వసతులు కల్పించాలి'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హన్మంత్ సింధే

బిచ్కుంద: సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలని జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ సింధే సూచించారు. మంగళవారం బి చ్కుందలో నియోజకవర్గంలోని అన్ని హాస్టళ్ల వార్డెన్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఆయా హాస్టళ్లలో సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్టళ్లలో సమస్యలు ఉంటే వెంటనే పై అధికారులు లేదా తన దృష్టికి తీసుకువస్తే అవసరమైన నిధులు మంజూరు చేయించి సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. గదులలో ఫ్యాన్లు, లైట్లు, మినరల్ వాట ర్ అందుబాటులో ఉంచాలని సూచించారు. మెనూ ప్రకారం రుచికరమైన పౌష్టికాహారం అందించాలని, సాయంత్రం స్నాక్స్ తప్పకుండా ఇ వ్వాలని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థులకు అందించే కాస్మొటిక్ చార్జీలు పెంచే యోచనలో ఉందన్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజు సాయంత్రం ఆయా సబ్జెక్టులలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేలా వార్డెన్‌లు కృషి చేయాలన్నారు. బాలికల హాస్టళ్లలో వార్డెన్లు ప్రతి రోజు అందుబాటులో ఉండాలని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీలు అశోక్, రాజు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అసిస్టెంట్ అధికారులు యాదగిరి, లియో, చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధోత్రే సేవలు మరువలేనివి



కామారెడ్డి క్రైం: బదిలీపై వెళ్తున్న స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే జిల్లాకు అందించిన సేవలు మరువలేనివని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. ఆయన మహబూబ్‌నగర్ జిల్లాకు బదిలీ అయిన నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఆర్‌డీవో సాయన్న, సీపీవో రాజారాం, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, ఏఎస్పీ అన్యోన్య తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా రూపొందించాలి

- క్షేత్ర స్థాయిలో వివరాలను పరిశీలించాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

కామారెడ్డి క్రైం: ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. ఓటర్ల జాబితా రూపకల్పనపై మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదలకు ముందు వచ్చిన అన్ని దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయాలన్నారు. జాబితా నుంచి తొలగించిన ఓటరు వివరాలను క్షేత్రస్థాయిలో మరోసారి ధ్రువీకరించుకోవాలన్నారు. ఫాం 6, 7, 8 ల ద్వారా వచ్చిన దరఖాస్తుల పరిశీలనను ఈనెల 27 లోగా పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపుల ఏర్పాటు, లైటింగ్, తాగునీరు, ఫర్నిచర్, పురుషులకు, స్త్రీలకు ప్రత్యేకంగా మరుగుదొడ్లు లాంటి అన్ని సౌకర్యాలు ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. ఓటర్ల సంఖ్య 1,500 కంటే ఎక్కువ ఉన్నచోట మరో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బంది, వారికి శిక్షణ, పూర్తి సమాచారంతో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో రవీందర్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ సాయి భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికంగా బలోపేతం కావాలి



మహిళా సంఘాలకు రుణాలను అందిస్తున్న కలెక్టర్, బ్యాంకు అధికారులు

కామారెడ్డి క్రైం: మహిళలు వ్యాపారాలు చేపట్టి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. మంగళవారం కామారెడ్డిలోని రోటరీ క్లబ్‌లో తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో మహిళా మహోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు వ్యవసాయంతో పాటు చేపలు, తేనెటీగలు, పాడిపరిశ్రమ, కోళ్ల పెంపకం, కూరగాయల సాగు, ఆయిల్‌పాం లాంటి వ్యాపారాలు చేయడం ద్వారా ఆర్థికంగా బలోపేతం కావచ్చని పేర్కొన్నారు. అర్హత గల స్వయం సహాయక సంఘాలకు రూ. 20 లక్షల వరకు రుణాలు అందిస్తున్నామని టీజీబీ చైర్మన్ వై.శోభ తెలిపారు. ఆర్థిక క్రమశిక్షణతో మహిళలు అభివృద్ధికి బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పంట రుణంతో పాటు ప్రత్యేకంగా రూపొందించిన రైతు నేస్తం రుణాలను, చేపల పెంపకంపై రుణాలు అందజేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు ప్రధాన మంత్రి సామాజిక భద్రతా పథకాలలో చేరి ఆర్థిక భరోసా పొందాలన్నారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా స్వయం సహాయక సంఘాలకు రూ.35 కోట్ల విలువైన రుణాలను అందించారు. కార్యకమంలో టీజీబీ రీజనల్ మేనేజర్ పురం నవీన్, డీఆర్‌డీవో సాయన్న, లీడ్ బ్యాంక్ జిల్లా మేనేజర్ సుధీర్ భార్గవ్, డీపీఎం రవీందర్, గ్రామీణ బ్యాంక్ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

జిల్లాలో సీఐల బదిలీలు

ఖలీల్‌వాడి: నిజామాబాద్ టౌన్ సీఐగా నరహరి బదిలీ అయ్యారు. ఆయనను సీసీఆర్‌బీ నుంచి టౌన్ సీఐగా బదిలీ చేస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. బాసర మల్టీజోన్ పరిధిలో 45 మంది సీఐలను బదిలీ చేస్తు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రుద్రూర్ సీఐగా పనిచేస్తున్న జానారెడ్డిని గజ్వేల్ టౌన్ సర్కిల్‌కు బదిలీ చేశారు. ఎస్‌ఐబీ నిజామాబాద్‌లో పనిచేస్తున్న ఎండీ ముఖీద్‌పాషాను ఐజీ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నిజామాబాద్ వన్‌టౌన్ సీఐగా పనిచేస్తున్న వెంకట్‌నారాయణను సౌత్ రూరల్ సీఐగా బదిలీ చేశారు. సౌత్ రూరల్ సీఐగా పని చేస్తున్న ఎం సురేందర్‌రెడ్డిని ఐజీ ఆఫీసులో రిపోర్టు చేయాలని ఆదేశించారు. నిజామాబాద్ రైల్వేస్టేషన్ ఎస్‌హెచ్‌వో ప్రణయ్‌కుమార్ ఆదిలాబాద్ ట్రాఫిక్ సీఐగా బదిలీ అయ్యారు.

కొనసాగుతున్న పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. ఉదయం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ 2వ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షకు 629 మంది విద్యార్థులకు 588 మంది హాజరు కాగా 41మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ఎంబీఏ, ఎంసీఏ నాలుగో రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షకు 475 మంది విద్యార్థులకు 460 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. అలాగే ఉదయం జరిగిన డిగ్రీ ఐదో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలకు 139 మంది విద్యార్థులకు 105 హాజరైనట్లు తెలిపారు.

బెటాలియన్‌లో ‘హర్ ఘర్ ధ్యాన్’



డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్‌లో మంగళవారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా ట్రైనర్ రాజారాణి అగర్వాల్ బృందం ఆధ్వర్యంలో హర్ ఘర్ ధ్యాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మెడిటేషన్, ప్రాణాయామం, యోగాసనాల గురించి బెటాలియన్ సిబ్బందికి నేర్పించారు. కమాండెంట్ సత్యశ్రీనివాస్, అసిస్టెంట్ కమాండెంట్స్ వెంకటేశ్వర్లు, భాస్కర్‌రావు, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.

మహాలక్ష్మినగర్‌లో చైన్ స్నాచింగ్

ఖలీల్‌వాడి: నగరంలోని నాలుగో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మి రోడ్ నంబర్–1లో శోభ మెడలో నుంచి రెండు తులాల బంగారు చైన్‌ను లాక్కెళ్లారు. స్కూటీపై వచ్చిన ఇద్దరు చైన్ లాక్కొని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంజీవ్ తెలిపారు.

‘ఉద్యోగ భద్రత కల్పించాలి’



భిక్కనూరు: యూనివర్సిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగాలను రెగ్యులర్ చేసేందుకు ప్రభుత్వం వెంటనే మంత్రి మండలి సబ్‌కమిటీని ఏర్పాటు చేయాలని కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నారాయణ గుప్తా డిమాండ్ చేశారు. మంగళవారం భిక్కనూరు సౌత్ క్యాంపస్‌లో కాంట్రాక్టు అధ్యాపకులు వర్షంలో గొడుగులు చేత పట్టుకుని నిరసన తెలిపారు. రెగ్యులరైజ్ చేయాలని నిరసన కార్యక్రమాలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్టు అధ్యాపకులు యాలాద్రి, నర్సయ్య, రమాదేవి, సునీత, వైశాలి, నిరంజన్, శ్రీకాంత్ దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వీడ్కోలు



కామారెడ్డి అర్బన్: నాగర్‌కర్నూలు జిల్లా అదనపు కలెక్టర్‌గా బదిలీపై వెళ్తున్న వెంకటేశ్ ధోత్రేను తెలంగాణ నాన్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకులు మంగళవారం క్యాంపు కార్యాలయంలో కలిసి వీడ్కోలు పలికారు. సరీ్వసులో చేరిన తొలిసారిగా ప్రొబేషనరీ, అదనపు కలెక్టర్‌గా నాలుగున్నర సంవత్సరాలు కామారెడ్డి జిల్లాతో ఉన్న అనుబంధం మరిచిపోలేనిదని వెంకటేష్ ధోత్రే అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.సాయిలు, కేంద్ర సంఘం కార్యదర్శి ఎం.నాగరాజు, ప్రతినిధులు దేవరాజు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి భవితకు తొలిమెట్టు

- ఈ ఏడాది అమలుకు విద్యాశాఖ కసరత్తు
- 21 నుంచి టీచర్లకు శిక్షణ
- గుణాత్మక విద్య పెంపొందించడమే లక్ష్యం



నిజామాబాద్‌అర్బన్: విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంపొందించడమే లక్ష్యంగా ఈ ఏడాది మళ్లీ తొలిమెట్టు కార్యక్రమాన్ని అమలు చేయనున్నారు. గతేడాది నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు కొంత మెరుగయ్యారు. దీంతో అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహించాలని రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లాలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. దీనికి సంబంధించి విద్యా శాఖ ఏర్పాట్లు కూడా పూర్తి చేసింది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు విద్యార్థులకు గుణాత్మక విద్యను పెంపొందించడం తెలుగు, ఇంగ్లిష్ చదవడం, రాయడం, గణితంలో కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.

మండలానికి ఆరుగురు టీచర్లకు శిక్షణ

జిల్లాలో తొలిమెట్టు కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 21, 22, 24 తేదీల్లో జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి మండలం నుంచి ఆరుగురు ఉపాధ్యాయులు శిక్షణ కార్యక్రమానికి హాజరవుతారు. అనంతరం మండల స్థాయిలో తెలుగు, గణితం, ఆంగ్లం బోధించే ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. అనంతరం తొలిమెట్టు కార్యక్రమాన్ని పాఠశాల స్థాయిలో ఆగస్టు నుంచి ప్రారంభించనున్నారు. జిల్లాలో డీఈవో పరిధిలో 666 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 192 మంది ఉపాధ్యాయులు ఆయా బడుల్లో శిక్షణ ఇవ్వనున్నారు. తొలిమెట్టుతో పాటు ఎఫ్‌ఎల్‌ఎం కార్యక్రమాన్ని కూడా ఇది వారికే అమలు చేశారు. ఇందులో విద్యార్థుల సామర్థ్యాలు గుర్తించిన అధికారులు రెండోసారి తొలిమెట్టు కార్యక్రమం అమలు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు చదవడం, రాయడం నేర్పిస్తారు. వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించి చదువులో ముందుకు వెళ్లేలా ప్రోత్సహించారు.

ఉన్నత విద్యార్థులకు ‘లిప్’

ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్(లిప్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో దీనిని సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో అమలు చేయనున్నారు. విద్యార్థులకు మాతృభాషతో పాటు ద్వితీయ భాష, తృతీయ భాషలో స్పష్టంగా మాట్లాడడం, తప్పులు లేకుండా రాయడం నేర్పడం దీని ఉద్దేశం. స్వీయ సామర్థ్యాల పెంపు, గణితం, సామాన్య, సాంఘిక శాస్త్రాల్లో విద్యార్థులు ప్రతిభ చాటేలా కార్యక్రమాన్ని రూపొందించారు.

పకడ్బందీగా చేపడుతాం



ఈ ఏడాది తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపడుతాం. ఇప్పటికే రాష్ట్ర స్థాయిలో రిసోర్స్‌పర్సన్‌లు శిక్షణ తీసుకున్నారు. 21 నుంచి జిల్లాలో శిక్షణ కార్యక్రమాలు చేపడతాం. విద్యార్థుల్లో గుణాత్మక విద్యను పెంపొందించే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతుంది.
– దుర్గాప్రసాద్, డీఈవో

విద్యార్థులకు ఎంతో ఉపయోగం



గతేడాది తొలిమెట్టు కార్యక్రమం నిర్వహించారు. దీంతో ప్రాథమిక స్థాయి విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు మెరుగయ్యాయి. ప్రస్తుతం కూడా ఈ కార్యక్రమం నిర్వహించడంతో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.
– వెనిగళ్ల సురేశ్, టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

- రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యం
- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్



కాంగ్రెస్ పాలన వద్దని ఫ్లెక్సీ పట్టుకొని నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

లింగంపేట(ఎల్లారెడ్డి): టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భేషరతుగా రైతులకు క్షమాపణ చెప్పాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ డిమాండు చేశారు. మంగళవారం ఆయన లింగంపేట మండలం పర్మళ్ల రైతు వేదికలో ఏర్పాటు చేసిన రైతుల నిరసన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తుంటే పీసీసీ అధ్యక్షుడు అహంకార పూరితంగా మాట్లాడుతూ రైతులను పక్కదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి 24 గంటల విద్యుత్ అవసరం లేదని కేవలం 3 గంటలు ఇస్తే చాలని చెప్పడం రైతులను అయోమయానికి గురిచేయడం కాదా అని ప్రశ్నించారు. రైతులు పండిస్తున్న ప్రతీ ధాన్యపు గింజ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. రైతును రాజు చేయడమే కేసీఆర్ లక్ష్యం అన్నారు. దేశమంతా కేసీఆర్ ప్రధాని కావాలని కోరుకుంటుందన్నారు. కాంగ్రెస్, బీజేపీ పాలనలో కరెంటు, నీటి కష్టాలు తప్ప ఏమి మిగిలాయని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రతీ తండాను జీపీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. సర్పంచ్ పర్వయ్య, సింగిల్ విండో చైర్మన్ దేవేందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దివిటి రమేశ్, ఏఎంసీ వైస్ చైర్మన్ సిద్దారెడ్డి, వైస్‌ఎంపీపీ విఠల్‌రెడ్డి, ఎంపీటీసీ రూప్‌సింగ్, తదితరులున్నారు.

ఎమ్మెల్యేకు నిరసన సెగ

లింగంపేట(ఎల్లారెడ్డి): కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణలో 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెప్పుకోవడం అంతా బూటకమని లింగంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బద్ద చంద్రబాబు ఆరోపించారు. 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నట్లు రికార్డులు చూపించాలని డిమాండ్ చేశా రు. రైతు వేదికలో జరుగుతున్న సమావేశాన్ని అడ్డుకోవడానికి యత్నించారు. కాంగ్రెస్ నాయకులు నిరసన తెలపడానికి సబ్‌స్టేషన్‌కు వెళ్తుండగా పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. పర్మళ్ల గ్రామంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు నిరసన కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు చంద్రబాబు మాట్లాడుతూ..24 గంటలు ఇస్తున్నట్‌లైతే సబ్‌స్టేషన్‌లోని లాబుక్కులో 24 గంటలు సరఫరా అవుతున్నట్లు చూపించాలని డిమాండు చేశారు. నేతలు మన్నె నరేష్, గణేష్, శ్రీనివాస్, భూమయ్య, రాజు పాల్గొన్నారు.

లింబాద్రిని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి



లింబాద్రి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

సిరికొండ: మారుమూల గ్రామం నుంచి రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ వరకు ఎదిగిన ప్రొఫెసర్ లింబాద్రిని ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పార్థసారథి అన్నారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్ స్వగ్రామమైన మండలంలోని రావుట్లలో మంగళవారం అభినందన సభ నిర్వహించారు. ఉన్నత విద్యా మండలి చైర్మన్‌గా నియామకమై తొలిసారి గ్రామానికి వచ్చిన లింబాద్రికి గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. లింబాద్రి భారతి దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్నికల కమిషనర్ మాట్లాడుతూ.. పుట్టిన రోజు నాడు పెద్ద హోదాలో సన్మానం అందుకోవడం లింబాద్రి జీవితంలో మర్చిపోలేనిదన్నారు. ఎంత ఎత్తుకు ఎదిగిన పుట్టిన ఊరును మరవకపోవడం ఆయన నిరాడంబరతకు నిదర్శనమన్నారు. తెలంగాణ యూనివర్సిటీ వీసీగా తాను, రిజిస్ట్రార్‌గా లింబాద్రి కలిసి యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేశామన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి మాట్లాడుతు తాను చదువుకునే రోజుల్లో ఎన్నో కష్టాలు అనుభవించానన్నారు. తన కష్టసుఖాల్లో గ్రామస్తులు అందించిన సహకారం మరువలేనిదన్నారు. తల్లిదండ్రులు నేర్పిన క్రమశిక్షణతోనే తాను ఇంత ఎత్తుకు ఎదిగానన్నారు. తనకు ఉన్నత పదవి రావడానికి సహకరించిన మంత్రులు కేటీఆర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళం అందచేశారు. ఓయూ వీసీ రవీందర్‌యాదవ్, మాజీ న్యాయమూర్తి నిమ్మ నారాయణ, అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ రాంచంద్రం, మధుశేఖర్, తహసీల్దార్ గఫార్‌మియా, ఎంపీడీవో లక్ష్మీప్రసాద్, సర్పంచ్ భూదేవ్వ, వైస్ ఎంపీపీ రాజన్న, వీడీసీ చైర్మన్ రమేష్‌గౌడ్, బాలయ్య, సాల్మన్, దేవిక, నర్సయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహం



సప్తాహంలో పాల్గొన్న భక్తులు

మద్నూర్(జుక్కల్): మండలంలోని సలాబత్‌పూర్ హనుమాన్ ఆలయంలో మంగళవారం అధిక శ్రావణ మాసం సందర్భంగా అఖండ హరినామ సప్తాహం కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుందని ఆలయ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలుగౌడ్ తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు, వార్కారీలు సప్తాహంలో పాల్గొన్నారు. ఆలయంలో నిత్యాన్నదానం చేపడుతున్నామని వారు అన్నారు.

దుర్కి సోమలింగేశ్వర ఆలయంలో..

నస్రుల్లాబాద్(బాన్సువాడ): దుర్కి శివారులో గల సోమలింగేశ్వర ఆలయంలో మంగళవారం అధిక మాస సప్తః కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు దివిటి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. రాములు మహరాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సప్తాహం నెల రోజుల పాటు నిర్వహిస్తున్నామన్నారు. మాజీ జెడ్పీటీసీ కిషోర్ యాదవ్, వార్కారీలు పాల్గొన్నారు.

వారం రోజుల్లో పీహెచ్‌సీ సమస్యల్ని తీరుస్తాం

- జిల్లా వైద్యాధికారి లక్ష్మణ్ సింగ్



నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలోని సమస్యలు తెలుసుకుంటున్న డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్

సాక్షి ఎఫెక్ట్..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): నాగిరెడ్డిపేట పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామని జిల్లా వైద్యాధికారి(డీఎంఅండ్‌హెచ్‌వో) లక్ష్మణ్ సింగ్ పేర్కొన్నారు. పీహెచ్‌సీలో నెలకొన్న సమస్యలపై ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన వరుస కథనాలపై స్పందించిన ఆయన మంగళవారం పీహెచ్‌సీని సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో చెడిపోయిన కరెంట్ వైరింగ్‌ను, పీహెచ్‌సీ ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలను ఆయన పరిశీలించారు. అనంతరం పీహెచ్‌సీలోని సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన చర్యలపై డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణితోపాటు నాగిరెడ్డిపేట సర్పంచ్ సునీతారెడ్డితో ఆయన చర్చించారు. వారం రోజుల్లో రూ.3 లక్షల నిధులు రానున్నాయని, వాటి ద్వారా ఆస్పత్రిలో కరెంట్ సమస్యతోపాటు ఇతర సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు.

20న నులి పురుగుల నివారణ దినోత్సవం

ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, డిప్యూటీ డీఎంహెచ్‌వో శోభారాణి తెలిపారు. ఈ సందర్భంగా 19 ఏళ్లలోపు వారికి అల్బెండజోల్ మాత్రలు ఇస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,92,352 మందికి అల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారని చెప్పారు. ఈ నెల 20న పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో అల్బెండజోల్ మాత్రలు వేస్తా రన్నారు. 20న మాత్రలు ఇవ్వనివారికి మళ్లీ 27న అంగన్‌వాడి కేంద్రాలతోపాటు పీహెచ్‌సీలలో అల్బెండజోల్ మాత్రలు వేస్తారని ఆయన చెప్పారు.

దత్తత గ్రామాల్లో విద్యుత్ పనులు పూర్తిచేయాలి



ఉమ్మడి జిల్లా విద్యుత్ అధికారులతో సమీక్షిస్తున్న సీఎండీ గోపాల్‌రావు


- ట్రాన్స్‌ఫార్మర్‌ల ఫెయిల్యూర్స్ తగ్గించాలి
- వంద శాతం బిల్లులు వసూలు చేయాలి
- సీఎండీ గోపాల్‌రావు

నిజామాబాద్ నాగారం : జిల్లాలోని ఆయా మండలాలు, గ్రామాల్లో దత్తత తీసుకున్న డీఈ, ఏడీఈ, ఏఈలు అందరూ కచ్చితంగా ఈ నెల చివరికల్లా విద్యుత్ పనులు పూర్తి చేయాలని సీఎండీ గోపాల్ రావు ఆదేశించారు. మంగళవారం విద్యుత్‌శాఖ ఎస్ఈ కార్యాలయంలో ప్రత్యేకంగా కామారెడ్డి, నిజామాబాద్ జిల్లా అధికారులతో సమీక్షించారు. సీఎండీ మాట్లాడుతూ, ట్రాన్స్‌ఫార్మర్స్ ఫెయిల్యూర్స్ తగ్గించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌ల మరమ్మతులు చేసిన తర్వాత ప్రభుత్వ వాహనంలో తరలించాలన్నారు. వంద శాతం బిల్లులు వసూళ్లు చేయాలని, ఆన్‌లైన్‌లో బిల్లులు చెల్లించేలా చూడాలన్నారు. ఆగిపోయిన మీటర్లు మార్చాలని, విద్యుత్ అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. వినియోగదారులు, రైతులతో సంబంధాలు మెరుగుపర్చుకోవాలని సూచించారు. పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దని, నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలన్నారు. రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. నిర్లక్ష్యం చేస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జిల్లా ఎస్ఈ రవీందర్, కామారెడ్డి ఎస్ఈ రమేష్ బాబు, డీఈలు అనిల్‌కుమార్, రమేష్, ముక్తార్, వెంకటరమణ, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, ఎస్ఈవో ఇతర అధికారులు పాల్గొన్నారు.

పదకొండు మంది మృతికి కారణమైన వ్యక్తికి పదేళ్ల జైలు

ఖలీల్‌వాడి : ఆరుగురు చిన్నారులు, ఐదుగురు మహిళల మృతికి కారణమైన వ్యక్తికి పది సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి టి శ్రీనివాస్ మంగళవారం తీర్పు వెలువరించారు. ఆర్మూర్ రూరల్ సర్కిల్ పోలీస్ అధికారి రమణ రెడ్డి కోర్టుకు సమర్పించిన అభియోగ పత్రం ప్రకారం.. నేర న్యాయ విచారణ ప్రక్రియలో భాగంగా 38 మంది ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు నమోదు చేసుకుని, 43 పత్రాలను పరిశీలించారు. వ్యక్తిగత నిర్లక్ష్యాన్ని పరిగణనలోకి తీసుకుని ముప్కాల్‌కు చెందిన ముద్దాయి గోపీ శ్రీనివాస్ యాదవ్‌కు ఈ శిక్ష విధించారు. 2018 మార్చి 25న శ్రీనివాస్ తన ఆటో (టీఎస్16 యుబీ 5782)లో ముప్కాల్, కొడిచెర్ల గ్రామాల నుంచి 19 మంది ప్రయాణికులతో బయలుదేరాడు. పరిమితికి మించిన ప్రయాణికులు, అతివేగం, అజాగ్రత్తగా ఆటోను నడపడంతో ఆటో మెండోరా గ్రామ శివారున రోడ్డుపై పల్టీలు కొట్టి రోడ్డు పక్కన వ్యవసాయ బావిలో పడిపోయింది. బావిలోని నీటిలో మునిగి బాల్కొండ మండలం చిట్టపూర్ గ్రామానికి చెందిన ఏడు సంవత్సరాల తెడ్డు ప్రశంశ, ఐదేళ్ల తెడ్డు చక్కాని, సంవత్సరంన్నర తెడ్డు చిన్ని, ఇరవై ఐదేళ్ల తెడ్డు రోజా, బాల్కొండ మండలం కొడిచెర్ల గ్రామానికి చెందిన ఆరు సంవత్సరాల మెట్టు విన్సశ్రీ, వర్ని మండలం మోస్రా గ్రామవాసి పద్నాలుగేళ్ల పెద్దోల్ల సంపత్, ఆర్మూర్ మండలం ఆలూరు గ్రామ చిన్నారి ఐదేళ్ల పుట్ట మనస్విని, మోర్తాడ్ మండలం ధర్మోరా మద్దికుంట లక్ష్మి, బాల్కొండ మండలం వెంపల్లి బొప్పారం సాయమ్మ, మెండోరా మండలవాసి నిమ్మ సత్తెమ్మ, డిచ్పల్లి మండలం కేశపూర్ వాసి గుండ్రపు గంగు చనిపోయారు. మరో తొమ్మిది మంది గాయపడ్డారు. ముద్దాయి గోపీ శ్రీనివాస్‌పై నేరారోపణలు రుజువు అయినట్లు నిర్ధారిస్తూ భారత శిక్షాస్మృతి సెక్షన్ 304 పార్ట్ 2 ప్రకారం పది సంవత్సరాల కఠిన జైలు శిక్ష, సెక్షన్ 337 ప్రకారం ఆరు నెలల సాధారణ జైలుశిక్ష, సెక్షన్ 338 ప్రకారం సంవత్సరం జైలుశిక్ష విధించారు. శిక్షలన్నీ ఏకకాలంలో అనుభవించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మాశరత్‌రెడ్డి

బోధన్‌టౌన్: పట్టణంలోని ఆచన్‌పల్లిలో మంగళవారం ఉదయం షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. కాలనీకి చెందిన తాండ్రాల అనిత కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. మంగళవారం ఆమె ఇంట్లో లేని సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి, రూ.పది వేల నగదు కాలిపోయింది. ఆర్ఐ వరుణ్ పంచనామా చేశారు. రూ.లక్ష 50 వేల వరకు నష్టం జరిగిందని బాధిరాలు తెలిపారు. బాధితురాలిని మున్సిపల్ చైర్ పర్సన్ తూము పద్మాశరత్‌రెడ్డి పరామర్శించారు. తూము శివమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సరుకులు, నగదు అందించారు. ఇందూర్ పాఠశాల కరస్పాండెంట్ కోడాలి కిశోర్‌కుమార్ రూ.5 వేల నగదు, గ్రామస్తులు రూ.20 వేలు అందజేశారు.

గుండెపోటుతో ఎంపీడీవో మృతి



ఎంపీడీవో నారాయణ

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఎంపీడీవో నారాయణ (58) మంగళవారం తెల్లవారుజామును గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయనకు నెల రోజుల క్రితం మెదడులో రక్తం గడ్డ కట్టడంతో చికిత్స తీసుకొని వారం క్రితం విధుల్లో చేరారు. మంగళవారం గుండెపోటు రావడంతో నిద్రలోనే మృతి చెందినట్లు తెలిపారు.

వర్షానికి కూలిన ఇళ్లు



రుద్రూర్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి మంగళవారం మూడు ఇళ్లు కూలిపోయాయి. కోటగిరి మండలం కొత్తపల్లిలో సైదయ్య, సాయిలుకు చెందిన ఇళ్లు పోతంగల్ మండలం కొడిచర్లలో ఒక ఇల్లు కూలిపోయింది. కొత్తపల్లిలో కూలిన ఇళ్లను ఎంపీడీవో మనోహర్ రెడ్డి పరిశీలిచారు. నిరాశ్రయులైన వారికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాల్సిందిగా జీపీ సిబ్బందిని ఆదేశించారు. ఆయనతో జీపీ కార్యదర్శి స్వప్న ఉన్నారు.

టిప్పర్ ఢీకొని ఒకరికి గాయాలు

ఖలీల్‌వాడి: నగరంలోని నిజాంకాలనీ వద్ద టిప్పర్, బైక్‌ను ఢీకొనడంతో ఒకరికి గాయాలైనట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. బోధన్‌కు చెందిన నౌకత్ పాషా నిజామాబాద్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం నిజామాబాద్‌కు వస్తుండగా నిజాంకాలనీ వద్ద టిప్పర్ ఢీకొంది. ఆయనను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

సదాశివనగర్: మండలంలోని ఉత్తునూర్ గ్రామానికి చెందిన నవీన్ మంగళవారం చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్సై సాగర్ తెలిపారు. నవీన్ ఈ నెల 14న బైక్‌పై కామారెడ్డి నుంచి స్వగ్రామానికి వస్తుండగా పద్మాజీవాడి చౌరాస్తా వద్ద బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న భారీకేడ్లను ఢీకొట్టాడు. తీవ్ర గాయాలు కావడంతో కామారెడ్డికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రికి తలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. నవీన్ గ్రామ పంచాయతీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. మృతుడి భార్య శీరిష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి



కామారెడ్డి క్రైం: గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మహిళ మృతి చెందిన ఘటన కామారెడ్డికి సమీపంలోని నర్సన్నపల్లి డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్ వైపు నుంచి నిజామాబాద్ వైపు వెళ్తున్న గుర్తు తెలియని డీసీఎం వాహనం రోడ్డు పక్కనే నడుచుకుంటు వెళ్తున్న గుర్తు తెలియని మహిళను ఢీకొంది. సమీపంలోని దాబా సిబ్బంది గమనించి ఘటన స్థలానికి వెళ్లి చూడగా మహిళ అప్పటికే మృతి చెందింది. దీంతో పోలీసులు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

విద్యుత్ తీగలు పడి ఆరు గొర్రెలు మృత్యువాత



మృతి చెందిన గొర్రెలు

భిక్కనూరు: మండలంలోని జంగంపల్లి శివారులో విద్యుత్ తీగలు మీద పడటంతో ఆరు గొర్రెలు మృతి చెందాయి. మంగళవారం గ్రామానికి చెందిన దొడ్ల నర్సయ్య తన గొర్లెల మందను మేపేందుకు గ్రామ శివారులోని బేసీసు ఫార్మ కంపెనీ సమీపంలోకి వెళ్లాడు. అక్కడ ఉన్న విద్యుత్ తీగలు కాసరం విరిగి కిందపడ్డాయి. గొర్రెలపై విద్యుత్ ప్రవహిస్తున్న తీగలు పడడంతో అక్కడికక్కడే మృతి చెందాయి. తీగలు కింద పడ్డ ప్రాంతానికి కొద్ది దూరంలో నర్సయ్య ఉండడంతో ఆయనకు ప్రాణాపాయం తప్పింది. విద్యుత్ అధికారులకు సమాచారం అందించడంతో వారు సరఫరాను నిలిపివేశారు.

కుప్రియల్‌లో గేదె..



సదాశివనగర్: మండలంలోని కుప్రియల్‌లో కరెంట్ షాక్‌తో మంగళవారం గేదె మృతి చెందింది. గున్నల మాధవికి చెందిన జెర్సీ గేదె మేతకు వెళ్లి విద్యుత్ స్తంభానికి తాకడంతో షాక్ కొట్టి చనిపోయింది. ఘటన స్థలాన్ని జెడ్పీటీసీ నర్సింలు సందర్శించి విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చారు.